క్లుప్తంగా

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని బాద్రపద మాసం బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



చిన్నకిట్టాలపాడు సభలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్పీ

సారవకోట: ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రస్తుతం గ్రామాల్లో 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. చిన్నకిట్టాలపాడు, కోదడ్డపనసలో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. చిన్నకిట్టాలపాడులో మస్టర్లలో దిదుబాట్లు, తేడాలు, చేసిన పనులకు, రికార్డుల్లో నమోదు చేసిన కొలతలకు తేడాలున్నట్లు తెలియజేశారు. చిన్నకిట్టాలపాడు నుంచి సవరకురిడింగి వరకు నిర్మించిన రహదారిలో క్వాలిటీ కంట్రోల్ పరిశీలనలో రూ.25 వేలు రికవరీకి ప్రతిపాదన చేసినట్లు ఎస్ఆర్పీ సూర్యనారాయణ తెలిపారు. కోదడ్డపనసలో ఒకే రేషన్ కార్డుపై రెండు జాబ్ కార్డులున్నాయని, రెండు కార్డులకూ 100 రోజుల చొప్పున పని దినాలు కల్పించినట్లు గుర్తించామని ఎస్ఆర్పీ తెలిపారు. గుంతల నిర్మాణాల్లో సైతం లోపాలునట్లు గుర్తించామన్నారు.

వినాయకునికి మాజీ స్పీకర్ ప్రత్యేక పూజలు



వినాయక పూజల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

ఆమదాలవలస: పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో కూన నాగు, వినాయక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 12 జ్యోతిర్లింగాల రూపాలతో ఏర్పాటు చేసిన గణనాధుడికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వాణమ్మ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రసాద్ శర్మ తీర్థప్రసాదాలు అందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, న్యాయవాది తమ్మినేని అన్నంనాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగిలిన కిట్లు ఎమ్మార్సీకి అందించాలి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయగా మిగిలిన పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లను వెంటనే ఎమ్మార్సీకి అందించాలని ఎంఈఓ సూచించారు. బుధవారం విద్యాశాఖ సిబ్బందితో సమీక్షించారు. బడిఈడు గల పిల్లలు పాఠశాలకు దూరంగా ఉంటే.. అటువంటి వారి వివరాలను అందించాలని సూచించారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు సంబంధించి ఆన్‌లైన్ వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరికీ అపార్ నంబర్లు కేటాయించాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం విద్యార్థులతో దరఖాస్తులు చేయించాలన్నారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల అక్రమాలపై ఫిర్యాదు



ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీలో 2015లో మంజూరైన గోకులం షెడ్‌ల బిల్లుల్లో అక్రమాలు జరిగాయని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ చిన్నమ్ముడుకి ఆ గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ పంచాయతీ పరిధిలోని కోనవానిపేట, గొర్రిబంద, జగ్గయ్యపేట గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఇటీవల మంజూరయ్యాయన్నారు. ఆ బిల్లులు గ్రామస్థాయి ఉపాధి సిబ్బందితోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు వారి సొంత ఖాతాలకు జమ చేసుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.3 లక్షల వరకు అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని గొర్రిబంద గ్రామస్తులు మొయ్యి సూర్యనారాయణ, పాగోటి పాపారావు, బోర మధు, తర్ర దాలినాయుడు, రావాడ రాఘవ, తదితరులు కోరారు.

పశుబీమా ఏదీ?

- ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే పైసా కూడా అందని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో పాడి రైతులు



పాడి పశువులు



మునగవలసలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన చూడి ఆవు

ఆమదాలవలస: పాడి రైతుకు అండగా నిలిచే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. పాడినే నమ్ముకొని జీవించే వారంతా కష్టాలు పడాల్సి వస్తోంది. వర్షా కాలం కావడంతో అనుకోని విపత్తులతో పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో పశుబీమా కొంత ఊరటనిస్తోంది. అలాంటి బీమాపై ఈ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో.. ఏదైనా ప్రమాదం జరిగితే పాడి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

వ్యాధుల కాలం..

వర్షా కాలంలో గేదెలు, ఆవులు, జీవాలకు హెచ్ ఎస్‌బీక్యూ, గాలికుంటు, థైలేరియా, తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాణాంతక వ్యాధులు సోకడం వల్ల పశువులు మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షా కాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు సంభవించినప్పుడు కూడా పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. లక్షల రూపాయలు అప్పు చేసి కొనుగోలు చేసిన పశువులు మృతి చెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. పశుబీమా ద్వారా సాయం అందితే కొంత ఉపశమనం కలుగుతోంది.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి..

ఆమదాలవలస మండలంలోని మునగవలస గ్రామానికి చెందిన కనమట చిన్నప్పన్నకు చెందిన పాడి పశువు(చూడి) ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. మేత కోసం వెళ్లిన ఆవుకు పక్కనే ఉన్న బార్బర్ దుకాణానికి ఆనుకొని ఉన్న విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.50 వేల నష్టం కలిగింది. ఇలాంటి సందర్భాల్లో బీమా సౌకర్యం ఉంటే కొంతమేర ఆసరాగా ఉంటుందని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా..				
మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ఆమదాలవలస	11,248	657	11,347	2,910
సరుబుజ్జిలి	9,361	88	9,386	4,055
బూర్జ	10,531	14	11,219	4591
పొందూరు	12,406	64	14,516	3900

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పశు బీమా పథకం పక్కాగా అమలు జరిగింది. పాడి పశువు మృతి చెందితే రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించి ఆదుకుంది. ప్రభుత్వం తరపున పశువైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేవారు. అందులో రైతు వాటా కింద 3.5 శాతం బీమా ప్రీమియం ఉండేది. దీని వలన రైతుకు కొంత మేర ఉపయోగంగా ఉండేది. క్షీరసాగర పథకం ద్వారా 6, 7 నెలల చూడితో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా సౌకర్యం లేకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పశుబీమాపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం.

బీమా సౌకర్యం కల్పించాలి



పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. ప్రమాదవశాత్తు జీవాలు మృత్యువాత పడితే పూర్తిగా నష్టపోతాం. రెండు పాడి ఆవులు కొనాలంటే ఇప్పుడు రూ.లక్షన్నర ఖర్చు అవుతోంది. పశుపోషణ కూడా భారంగా మారింది. ఇలాంటి సమయంలో బీమా సౌకర్యం లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పశుపోషణ వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– జి.కృష్ణమూర్తి, పాడిరైతు, పొన్నాంపేట, ఆమదాలవలస మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రస్తుతం ఆవులు, గేదెలు ఇతరత్రా పెంపుడు జీవాలకు సంబంధించిన బీమా ప్రీమియం కట్టించుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇంతవరకు అందలేదు. బీమా సౌకర్యంపై చాలామంది రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బీమా సౌకర్యం కల్పిస్తాం.

– జి.నారాయణరావు, పశుసంవర్థకశాఖ ఏడీ, ఆమదాలవలస

రైతు కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టవా?



విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆరుగాలం కష్టపడి పంటలు పండించి అందరికీ అన్నంపెట్టే అన్నదాత కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మన జిల్లాలో 50 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. 50 ఏళ్ల క్రితం మొదలుపెట్టిన వంశధార ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదని, రూ.50 కోట్లు ఖర్చు పెడితే ప్రాజెక్ట్ పూర్తవుతుందన్నారు. ఈ ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. టీడీపీ నాయకులు ఎరువుల దగ్గర రాజకీయం చేస్తున్నారని, వారికి ఓటు వేసిన వారికే యూరియా ఇస్తామని గ్రామాల్లో చెబుతున్నారన్నారు. రైతుల ఆగ్రహంలో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. ఎక్కడైనా వాహనంతో యూరియా వస్తోందని టీడీపీ నాయకులకు తెలియగానే వెళ్లి వారి ఇళ్లల్లో, గోడౌన్లలో నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు యూరియా దొంగలుగా తయారయ్యారన్నారు. ఒక్క బస్తా యూరియా లభించక రైతులు పోలీసులతో దెబ్బలు తింటున్నారన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడానికి బయలుదేరితే వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడతామని, అరెస్టులు చేస్తామని ఈ ప్రభుత్వం పోలీసులతో బెదిరించిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను తక్షణమే అందించాలని, లేకపోతే ఈ ప్రభుత్వం మెడలు వంచైనా రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు అన్ని విధాలుగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేశారన్నారు. అన్ని రకాలుగా ఆర్థిక సహాయం చేశారన్నారు. పంటలకు బీమా సౌకర్యం కల్పించి వారి అకౌంట్లలో డబ్బులు వేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, బూత్ కమిటీ రాష్ట్ర విభాగ సంయుక్త కార్యదర్శి దుంపల శ్యామలరావు, ఆమదాలవలస టౌన్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, రొట్టవలస సర్పంచి మూడడ్ల రమణ, మాజీ కౌన్సిలర్లు దుంపల చిరంజీవిరావు, నాయకులు కూన రామకృష్ణ, నున్నగాపుల చిన్నారావు పాల్గొన్నారు.

పలాసలో కలిపితే ఉద్యమిస్తాం



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పడబోయే పలాస జిల్లాలో కలపవద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హిరమండలంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. భౌగోళిక పరిస్థితులు, రవాణా, ఇతరత్రా వసతుల దృష్ట్యా శ్రీకాకుళంలోనే పాతపట్నం నియోజకవర్గం ఉండడం సముచితమన్నారు. కూటమి పాలకులు పాతపట్నం నియోజకవర్గాన్ని పలాసలో కలిపే ప్రయత్నం చేస్తుండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ తరఫున ఉద్యమిస్తామన్నారు. పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సింది పోయి.. ఇలా విభజన పేరుతో ప్రమాదంలో పెట్టే ప్రయత్నం చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాసలో కలిపే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు పరిశీలన



కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరిసరాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తూరు: కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం ఎఫిలియేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కె.శ్రీరాములు, డాక్టర్ ఎన్.ఎస్.ఎన్.స్వామి బుధవారం స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణను పరిశీలించారు. కొత్తూరులో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు నిబంధనల ప్రకారం కొత్తూరు, భామిని, ఎల్.ఎన్.పేట, హిరమండలం, సీతంపేట మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, ఇంటర్ కాలేజీలు మొత్తం 14 ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలైన పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని కమిటీ సభ్యులకు పలువురు తెలిపారు. పలు రికార్డులను సభ్యులు పరిశీలించారు. కాలేజీ మంజూరైతే మొదటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభం కోసం అవసరమైన గదులు కేటాయించాలని ప్రిన్సిపాల్ ధనుంజయరావుకు సభ్యులు కోరారు. దీనికి ప్రిన్సిపాల్ అంగీకరించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పాతపట్నం ఎమ్మెల్యే ఇచ్చిన వినతి మేరకు విద్యాశాఖ కమిషనర్ ఎఫిలియేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు చెప్పారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావు, అధ్యాపకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన



బాక్స్‌లో బ్యాలెట్ పేపర్ వేస్తున్న విద్యార్థి



ఓటు హక్కును వినియోగించుకున్న తరువాత సిరా గుర్తును చూపిస్తున్న విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు బుధవారం అవగాహన కల్పించారు. స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్పీఎల్)ను ఎన్నుకునేందుకు పార్లమెంటరీ పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులు పోటీ పడటంతో పేర్లు, ఫొటోలతో కూడిన బ్యాలెట్ పేపర్ తయారు చేయించారు. ఆ బ్యాలెట్ పేపర్‌ను 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసే సమయంలో సిరా గుర్తును చూపుడు వేలుపై పెట్టడం సాధారణ ఎన్నికల్లో ఏ విధంగా జరుగుతుందో అదే పద్ధతి నిర్వహించారు. అనంతరం ఓట్లు లెక్కింపు చేసి ఎక్కువ ఓట్లు వచ్చిన విద్యార్థిని ఎస్పీఎల్‌గా ఎంపిక చేశారు. ఈ ఓటింగ్ విధానానికి ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి పరిశీలకులుగా వ్యవహరించారు.

గొడియాల బందకు గండి



గండి పడి పొలాల్లో పేరుకుపోయిన మట్టి

మెళియాపుట్టి: మండలంలోని పాత్రలోవ గ్రామంలోని గొడియాల బందకు గండిపడింది. కిందనున్న పంట పొలాల్లోకి నీరు ఉధృతంగా పారడంతో కొంతమేర వరి పొలాల్లో మట్టి చేరింది. బుధవారం రైతులు చూసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గండికొట్టిన ప్రదేశాన్ని వీఆర్వో దేవేంద్ర పరిశీలించారు. సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గండిపడిందని రైతులు చెబుతున్నారు. చెరువు కింద 40 ఎకరాలకుపైనే ఆయకట్టు ఉందన్నారు. వెంటనే గండిపూడ్చకపోతే నష్టపోతామన్నారు.

అన్నసమారాధన



సరుబుజ్జిలి: అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు



నరసన్నపేట: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామం బంగ్లావీధి వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మారుతి నవ యువజన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చింతువానిపేటలో..

నరసన్నపేట: మండలంలోని చింతు వానిపేటలో వినాయక నవరాత్రులు సందడిగా జరుగుతున్నాయి. దీంట్లో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కమిటీ సభ్యుడు నడిమింటి సాయి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా వీరస్వామి



ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా కాదుర్ల వీరస్వామిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, నియోజకవర్గ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎంపీడీఓగా సింహాచలం

పొందూరు: ఎంపీడీఓ (ఎఫ్ఏసీ)గా పి.సింహాచలంను నియమిస్తూ జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.మన్మధరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. సింహాచలం పొందూరు ఎంపీడీఓ కార్యాలయంలోనే ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

యూరియా కోసం పడిగాపులు



పాగోడు సచివాలయం వద్ద వేచి ఉన్న రైతులు

జలుమూరు: యూరియా కోసం రైతన్నలకు పడిగాపులు తప్పడంలేదు. సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వద్ద నిత్యం బారులు తీరుతునే కనిపిస్తున్నారు. పాగోడు సచివాలయం వద్ద బుధవారం ఉదయానికే రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూకట్టారు. తమకు సరిపడా ఎరువులు అందడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారమే ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ కింజరాపు రవికుమార్ తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి



తీమర విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

పాతపట్నం: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ పోటీతత్వం అలవర్చుకోవాలని హెచ్ఎం బి.సింహాచలం అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలో 8 ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తీమర విన్నర్, తామర రన్నర్‌గా నిలిచాయి. విద్యార్థులకు షీల్డ్‌లను గ్రామ పెద్దలు ఇప్పిలి ధనుంజయ, తారకేశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ..



పొందూరు: సత్తిబాబును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్



హిరమండలం: జనార్దనరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

పొందూరు: పొందూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అనకాపల్లి సత్తిబాబు అనారోగ్యంతో వైజాగ్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్తిబాబును వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో అనకాపల్లి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ధనుపురంలో..

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంగూరు జనార్దనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, తదితరులు ఉన్నారు.

కుంకుమార్చనలు



వినాయక నవరాత్రుల్లో భాగంగా నరసన్నపేట పట్టణంలోని ముద్దాడ వీధిలో బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. జోష్యుల సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పరిసర వీధులకు చెందిన మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– నరసన్నపేట

ఘనంగా గణేశ్ నిమజ్జనం



నృత్యం చేస్తున్న యువత

జలుమూరు: శ్రీముఖలింగంలోని సుప్రీం వీధిలో ఏర్పాటు చేసిన గణపతిని బుధవారం వంశధార నదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడి ఊరేగింపు చేపట్టిన అనంతరం నదిలో కలిపారు.

పశుగ్రాసం సాగుచేయాలి

పాతపట్నం: పాడి రైతులు పశుగ్రాసాన్ని సాగు చేసుకోవాలని టెక్కలి డివిజనల్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ సి.హెచ్.నరసింహులు అన్నారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. విజన్ ప్లాన్‌ను తయారు చేసుకోవాలన్నారు.